దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్, జూన్10 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని లోకారి(కే), బేల, నేరడిగొండ, మామడ మినీ గురుకులాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి ఒకటి, 2, 3, 4, 5వ తరగతిలో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశానికి మిగిలిన 32 సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ నెల 18వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సొంత మండలాల విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

డీఎడ్ పరీక్ష గడువు పొడిగింపు

ఎదులాపురం, జూన్ 10 : డీఎడ్ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును పొడిగించినట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష జూలై 10వ తేదీన ఆన్‌లైన్‌లో ఉంటుందని తెలిపారు.

బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి

ఎదులాపురం, జూన్ 10 : బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సైరి శ్రీకాంత్, మినాక జలంధర్ రెడ్డి సోమవారం ఆదిలాబాద్‌లో డీఈవో ప్రణీతకు వినతిపత్రం అందజేశారు. సీనియార్టీ జాబితాలు తప్పులు లేకుండా చూడాలన్నారు. పదోన్నతుల జాబితా రూపొందించేముందు తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ విషయ నిపుణలచే కమిటీలు ఏర్పాటు చేసి సర్టిఫికేషన్‌ను క్షుణంగా పరిశీలించి అర్హులకు అన్యాయం జరగ కుండా చూడాలని కోరారు.

25శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలి

ఎదులాపురం, జూన్ 10 : విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ సోమవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ప్రైవేట్ పాఠశాలలో నిరుపేద దివ్యాంగులు, అనాథలు,హెచ్ఐవీ బాధిత పిల్లలు, వీధి బాలలకు 5 శాతం సీట్లు కేటాయించాలని కోరారు. పేద ఎస్సీ బాలబాలికలు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, ఓసీ 6శాతం సీట్లు కేటాయించాలన్నారు. ఉచిత ప్రవేశాలు కల్పించి సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

అందుబాటులో విత్తనాలు

తాంసి, జూన్ 10 : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ప్రాథమిక సహకార సంఘం సీఈవో కేశవ ఒక ప్రకటనలో తెలిపారు. సోయాబిన్ విత్తనాలు జేఎస్ 9305, ఎంఏయూఎస్ 612 రకాలు అందుబాటులో ఉండగా 30 కేజీల బస్తా ధర రూ.2525 ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు పట్టాపాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలను తీసుకొని రావాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సారంగాపూర్, జూన్ 10: మండలంలోని కంకెట గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు మేకల చిన్నగంగన్న మూడు రోజుల క్రితం గండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను సోమవారం జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట నాయకులు దశరథ రాజేశ్వర్, సింగం భోజాగౌడ్, ఎల్లన్న, సురేందర్, మారుతి, ఆనంద్‌రావు, గజానంద్, శేఖర్, రాజేశ్వర్, రాజు, దేవన్న ఉన్నారు.

తానూర్ ఎంపీడీవోగా అబ్దుల్ సమద్

తానూర్, జూన్ 10 : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నూతన ఎంపీడీవోగా అబ్దుల్ సమద్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన నేరడుగొండ ఎంపీడీవోగా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు ఎంపీవోగా పని చేసిన మోహన్‌సింగ్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహించారు. ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన అబ్దుల్ సమద్‌కు సిబ్బంది స్వాగతం పలికి మిఠాయిలు తినిపించారు.

న్యాయవాదుల సంబురాలు

సంబురాలు చేసుకుంటున్న న్యాయవాదులు

నిర్మల్ అర్బన్, జూన్ 10: భారత ప్రధాని నరేంద్ర మోదీ మూడో సారి అధికారం చేపట్టడంతో జిల్లా బీజేపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం మిఠాయిలు పంపిణీ చేసి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ రమణ రావు, న్యాయవాదులు శుభకరణ్, నూనె గంగాధర్, మహేందర్, రమణ, ఆర్ రత్నం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బాసరకు పాదయాత్రగా చేరుకున్న హర్యానా యువకుడు

పాదయాత్రగా వచ్చిన హర్యానా యువకుడు

బాసర, జూన్ 10 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసరకు కాలికనడకన హర్యానా చెందిన హరీశ్‌పండిత్ సోమవారం చేరుకున్నాడు. అమ్మ వారిని దర్శించుకొని పూజలు చేసి మాట్లాడారు. తాను 2023 ఆగస్టు 21న రాజస్థాన్ నుంచి పాదయాత్ర ప్రారంభించానని, చివరి మధ్యప్రదేశ్ రాష్ట్రం వరకు వేయి కిలోమీటర్ల వరకు పాదయాత్ర పూర్తి చేసుకుంటానని తెలిపారు.

విత్తన, ఎరువుల దుకాణాల్లో తనిఖీ

రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏవో

ఇంద్రవెల్లి, జూన్ 10: ముత్నూర్, ధనోరా(బీ), ఇంద్రవెల్లిలోని విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో సోమవారం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఏవో అరుణ తనిఖీ చేశారు. దుకాణాల్లో నిల్వ ఉంచిన విత్తనాలతో పాటు రైతులకు విక్రయించిన విత్తనాల వివరాల నమోదు రికార్డులు పరిశీలించారు. అనంతరం అన్ని రకాల విత్తనాలకు చెందిన శాంపిల్ సేకరించారు. వారి వెంట ఏఈవోలు మల్లేశ్, కరుణ, వీర, వివేక్, నవతేజ్ ఉన్నారు.

మిషన్ భగీరథపై సర్వే

ఇచ్చోడ, జూన్ 10 : ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో ఎంపీడీవోలు లక్ష్మణ్, బాల గంగాధర్ సోమవారం మిషన్ భగీరథ స్థితిగతులపై సర్వే నిర్వహించారు. సిరికొండ మండలం సోంపెల్లి, ఇచ్చోడ మండలం కోకస్‌మన్నూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో మిషన్ భగీరథపై సర్వే నిర్వహించారు. మిషన్ భగీరథ నల్ల ఫొటో, కుటుంబీకుల ఆధార్ కార్డు ఫొటో ఆన్‌లైన్ నమోదు చేశారు. వారి వెంట కార్యదర్శులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్ర భవనం ప్రారంభం

ఇంద్రవెల్లి, జూన్ 10: కేస్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కేస్లాగూడ(ఎం)లో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఎంపీటీసీ మడావి భీంరావ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు మీర్జా యాకుబ్‌బేగ్, ఐసీడీఎస్ శాఖ అధికారి మంజులత, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడులకు యూనిఫాంలు

- మహిళా సంఘాలకు కుట్టుపని అప్పగింత
- రెండు రోజుల్లో పాఠశాలలకు చేరవేసేలా చర్యలు

యూనిఫాం కుట్టు పనులు పరిశీలిస్తున్న ఐకేపీ ఏపీఎం మైస రమేశ్

నార్నూర్, జూన్ 10 : ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇందులో భాగంగా సర్కార్ బడుల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు యూనిఫాంలను అందించేందుకు ముందుకు వచ్చింది. విద్యార్థులకు పాఠశాల ప్రారంభం తొలిరోజే వారికి నూతన యూనిఫాం అందించేందుకు ప్రణాళిక రూపొందించింది. దీంతో ఈ ఏడాది నుంచి స్వయం సహాయక సంఘాల మహిళలకు దుస్తులు కుట్టి అందించే బాధ్యతను అప్పగించింది. కాంట్రాక్టర్లకు కుట్టు పనిని అప్పగించడంతో పాఠశాలలు ప్రారంభమై నెలలు గడిచిన పూర్తిస్థాయిలో విద్యార్థులకు సరిపడా విధంగా యూనిఫాంలు అందించలేని పరిస్థితి. కొలతల్లో హెచ్చు, తగ్గులు ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ నుంచి వస్త్రం కొనుగోలు చేసి మహిళా సంఘాల సభ్యులకు అప్పగించారు. ఫిబ్రవరిలోనే వీవోఏలు ప్రధానోపాధ్యాయుల చొరవతో విద్యార్థుల కొలతలను సేకరించారు.

4,712యూనిఫాంలు సిద్ధం...

నార్నూర్, గాదిగూడ మండలాల్లో జడ్పీ, ప్రాథమికోన్నత, ప్రాథమిక, కేజీబీవీ కలిపి మొత్తం 141 పాఠశాలలు ఉన్నాయి. రెండు మండలాల్లో స్వయం సహాయక సంఘాలు 995 ఉండగా అందులో 10,603 మంది సభ్యులు ఉన్నారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా 102 మంది సభ్యులు 4,712 మంది విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలు కుట్టారు. బాలికలు 2300, బాలురు 2412 మంది ఉన్నారు. చిన్నచిన్న పనులు మిగిలాయి. వాటిని సైతం పూర్తి చేసి రెండు రోజుల్లో పాఠశాలలకు కుట్టిన దుస్తులు అందజేయనున్నారు. కుట్టు పనులను విద్యాశాఖ, ఐకేపీ అధికారులు, ఎంపీడీవోలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

నిరంతరం పని ఉండేలా చూడాలి...

స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు యూనిఫాం కుట్టడంతో మంచి ఉపాధి పొందుతున్నాం. ప్రభుత్వపరంగా దుస్తులు కుట్టే పనిని మాకు అందించడం ఎంతో ఆనందంగా ఉంది. జత కుట్టుకు రూ.50ఇస్తున్నారు. అదనంగా కొంత డబ్బును పెంచితే బాగుండు. నిరంతరం పని ఉండేలా సంబంధిత అధి కారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపాలి. -ఆడె జయశ్రీ, నార్నూర్

రెండు రోజుల్లో పంపిణీ...

నార్నూర్, గాదిగూడ మండలాల్లోని 141 పాఠశాలలకు చెందిన 4,712 మంది విద్యార్థులకు దుస్తులు కుట్టాల్సి ఉండగా ఇప్పటికే సిద్ధం చేశాం.12వ తేదీకల్లా ప్రతి పాఠశాలలకు అప్పగిస్తాం. 102మంది సభ్యులు దుస్తులు కుట్టారు. రెండు రోజుల్లో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అందేలా చర్యలు చేపడుతున్నాం. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం మహిళా సంఘాలకు అప్పగించింది. -మైస రమేశ్, ఐకేపీ ఏపీఎం, నార్నూర్

కూచిపూడి నృత్యంలో నిర్మల్ వాసుల ప్రతిభ

అవార్డు, ప్రశంసాపత్రాలతో నిర్మల్ వాసులు

నిర్మల్ అర్బన్, జూన్ 10 : ఒడిశా రాష్ట్రంలోని పూరీ జగన్నాథ ఆలయంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ అవార్డు గ్రహీత భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా జగన్నాథ రథయాత్రను పురస్కరించుకొని నిర్వహించిన కూచిపూడి నృత్యంలో నిర్మల్‌కు చెందిన పలువురు ప్రతిభ కనబర్చారు. నిర్మల్‌కు చెందిన అనంతుల సరిత, సుహాని, వృషిక, ఆరాధ్య, అనన్య, విస్మయి, వేదాన్వి, నిహిర, సహాన, శాన్వి, తన్మయ్, వైష్ణవి, స్వప్న అత్యుత్తమ ప్రతిభను గుర్తించి నిర్వాహకులు లలితరావ్ చేతులు మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందుకున్నారు. ప్రతిభ కనబర్చిన వీరిని నృత్యమాల అకాడ మీ శిక్షకురాలు అంజలి రెడ్డి, ప్రజలు అభినందించారు.

భూకబ్జాదారులను అరెస్టు చేయాలి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు

ఎదులాపురం, జూన్ 10 : ఆదిలాబాద్‌లోని కైలాస్‌నగర్‌లో సొసైటీకి సంబంధించిన 8 ప్లాట్లలో 2 ప్లాట్లని తప్పుడు ధ్రువపత్రాలతో కబ్జాలు చేయడానికి ప్రయత్నించిన వారిపై కేసులు నమోదు చేయాలని కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లోక ప్రవీణ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు దుర్గం శేఖర్ కోరారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షి షాను కాలనీవాసులతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ మేరకు వెంటనే ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌ను ప్లాట్ల వద్దకు వెళ్లి దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. స్పందించిన కలెక్టర్‌కు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ముత్యాల చిట్టిబాబు, రాంకిషన్, రాంకుమార్, రాంరెడ్డి, కొండల్‌రావు, బాబురావు, రాకేశ్, త్రినాథ్, ప్రవీణ్ అగర్వాల్, కాలనీవాసులు ఉన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

మాట్లాడుతున్న ఎంఈవో నారాయణ

గుడిహత్నూర్, జూన్ 10 : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడానికి కోటి రూపాయలతో పనులు జరుగుతున్నాయని ఎంఈవో ఆర్ నారాయణ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేంద్ర న్యాను అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడం, వాటి బలోపేతానికి అందరి సహకారం అవసరమని తెలిపారు. ఏవో రేవతి మాట్లాడుతూ పత్తి విత్తనాలు, ఎరువులు మండలానికి సరిపడే విధంగా అందుబాటులో ఉన్నాయని ఆందోళన చెందవద్దన్నారు. టాస్క్‌ఫోర్స్ ద్వారా నకిలీ విత్తనాలు అమ్మకుండా చూస్తున్నామన్నారు. పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ మాట్లాడుతూ పశువుల్లో జబ్బ, గొంతువాపు వ్యాధులు సోకకుండా వ్యాక్సినేషన్ చేస్తున్నామన్నారు. రాయితీపై గడ్డి విత్తనాలు వస్తాయని అవసరమున్నా రైతులు దగ్గర్లోనున్నా పశు వైద్యశాలలో సంప్రదించాలని సూచించారు. ఈజీఎస్ ఏపీఎం శ్యామియల్ మాట్లాడుతూ ఈజీఎస్ ద్వారా నిలగిరి ప్లాంటేషన్, 50 ఎకరాల్లో మామిడి ప్లాంటేషన్ చేపడుతున్నామని ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హరితహారం కింద ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ స్థలం, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతామని పేర్కొన్నారు. మిషన్ భగీరథ ఏఈ ఆదిత్య మాట్లాడుతూ వాటర్ ట్యాంకుల క్లినింగ్ 10 రోజులకొకసారి చేయాలన్నారు. పైపులు లీకేజీ లేకుండా చూడాలని, కలుషిత నీరు వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పంచాయతీరాజ్, ఐకేపీ, ఆర్టీసీ, ఐసీడీఎస్ శాఖ అధికారులు తమ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి, చేపడుతున్నా కార్యక్రమాలు చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీవో అబ్దుల్ హై, ఎంపీటీసీలు శగీర్‌ఖాన్, కోవ తులసి, మండల కోఆప్షన్ సభ్యుడు జమీర్, పీఏసీఎస్ చైర్మన్ ముండె సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలు కురిసిన తర్వాతే విత్తుకోవాలి

జైనథ్, జూన్ 10 : రెండు భారీ వర్షాలు కురిసిన తర్వాతే రైతులు విత్తనాలు విత్తుకోవాలని ఏఈవో తౌసిఫ్ అన్నారు. సోమవారం పెండల్‌వాడ గ్రామంలోని రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిలో సరిపడ తేమ లేకపోవడం వల్ల విత్తనాలు మొలకెత్తవన్నారు. విత్తన శుద్ధి చేసుకొని విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి, జూన్ 10: అనుకూలమైన వర్షం కురిస్తేనే విత్తనాలు వేయాలని ఏఈవో మల్లేశ్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని దస్నాపూర్, మామిడిగూడ, వడగాం, వాల్గొండ, హీరాపూర్, కేస్లాపూర్, కేస్లాగూడ, ముత్నూర్, ధనోరా(బీ), గౌరాపూర్, దోడంద, గట్టెపల్లి, పిట్టబొంగురం, అంజి, గిన్నేరా గ్రామాల్లో ఏఈవోల ఆధ్వర్యంలో పంట సాగు విధానంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు వివేక్, నవతేజ్, వీర, కరుణ, లతభారతి, రైతులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలకు తక్షణమే శిక్షణ అందించాలి

మాట్లాడుతున్న డివిజన్ అధ్యక్షుడు ఆశమొల్ల మోహన్

భైంసా, జూన్ 10 : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు రాత్రింబవళ్లు వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీలకు తక్షణమే శిక్షణ అందించాలని డివిజన్ అధ్యక్షుడు ఆశమొల్ల మోహన్ అన్నారు. సోమవారం భైంసాలో మండల ఆర్ఎంపీల సమావేశం నిర్వహించారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచినట్లు శిక్షణ అందించి ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సాగర్ అమ్ముల, మండల అధ్యక్షుడు అర్జున్, కోశాధికారి తుకారాం, మండల ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో చేరండి

ఎదులాపురం, జూన్ 10 : తల్లిదండ్రులు తమ పిల్లలను వసతిగృహాల్లో చేర్పించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు, శాఖ ద్వారా నిర్వహించబడుతున్న వసతి గృహాల వివరాలకు సంబంధించిన కరపత్రాలను కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అధికారులు కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో డీఎస్సీడీవో భగత్‌సునీతా కుమారి, డీబీసీడీవో రాజలింగు, డీఈవో ప్రణీత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లబండిపై ప్రచారం

పెంచికల్‌పాడ్‌లో ఎడ్లబండి ఎక్కి ప్రచారం చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

కుంటాల, జూన్ 10: బడిబాటలో భాగంగా సోమవారం పెంచికల్‌పాడ్, కుంటాలలో విద్యార్థులు, తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ బడుల్లో అందించే ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజన వసతి, దుస్తులు, నోట్‌బుక్స్ ఇలాంటి వసతులపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు సక్రపు గజేందర్, ఎం. ఎల్లన్న, వెంకట్ రావు, వీవీ గజేందర్, పంచాయతీ కార్యదర్శి సారిక, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బిల్లింగ్ ప్రారంభం

కుంటాల, జూన్ 10: విద్యుత్ వినియోగదారులు బిల్లు చెల్లించినప్పుడు ఇక మాన్యువల్ బిల్ కాకుండా వెంటనే ఆన్‌లైన్ బిల్లును పొందవచ్చని ట్రాన్స్‌కో ఏఈ శివప్రసాద్ అన్నారు. సోమవారం అందకూర్‌లో ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. విద్యుత్ బిల్లులను స్వీకరించి కంప్యూటరైజ్డ్ రసీదులను వినియోగదారులకు అందజేశారు. ఆన్‌లైన్ రెవెన్యూ కలెక్షన్ వల్ల రసీదు జారీ చేయడంలో పారదర్శకత ఉంటుందని, వినియోగదారుల ట్రాన్స్‌కో ఖాతాల్లో వెంటనే నమోదు అవుతుందని చెప్పారు

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అదనపు ఎస్పీ సురేందర్‌రావు

ఎదులాపురం, జూన్ 10 : ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన నేర చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని అదనపు ఎస్పీ బీ సురేందర్ రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీసు శిక్షణ కేంద్రంలో పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూలై 1వ తేదీ నుంచి అమలు చేయనున్న నూతన క్రిమినల్ కోడ్ చట్టాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం-2023 చట్టాల గురించి వివరిస్తూ అమలు తీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ ఫణిధర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 10 : నిర్మల్‌లోని ఇందిరానగర్‌కు చెందిన గుర్రం వేణుగోపాల్ రమాదేవి కుమార్తె సాయి మనోజ్ఞ జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో 2514 ర్యాంకు సాధించినందుకు పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రాంచందర్ దంపతులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సాయినాథ్‌రెడ్డి, శిరీష్, నాయుడి సురేశ్, విజయ, శిరీష తదితరులు ఉన్నారు.

భద్రత నియమాలు పాటించాలి

దస్తురాబాద్, జూన్ 10 : అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా భద్రత నియమాలు పాటించాలని ఏడీఏ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సోమవారం సంబంధిత అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి, భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ ఇంజినీర్ నాగరాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాజెక్టులో గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

భైంసా, జూన్ 10 : గడ్డెన్న వాగు ప్రాజెక్టులో గల్లంతైన విద్యార్థి మృతదేహం సోమవారం లభ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. భైంసా పట్టణం పిప్రి కాలనీకి చెందిన సోలంకి పవన్(18) ఆదివారం స్నేహితులతో కలిసి సెల్ఫీ కోసం వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి ప్రాజెక్టులో పడిపోయాడు. ఈత రాకపోవడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రాత్రి వరకు గాలించినప్పటికీ మృత దేహం లభ్యం కాలేదు. సోమవారం ఉదయం గజ ఈతగాళ్లతో గాలించగా మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్, డీసీఎం ఢీ : ఒకరి మృతి

నిర్మల్ అర్బన్, జూన్ 10 : మామడ మండలం (హైదరాబాద్- నాగపూర్) జాతీయ రహదారి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు మామడ ఎస్ఐ సందీప్ తెలిపారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. నిర్మల్ వైపు ట్రాక్టర్ వస్తున్న క్రమంలో మేడిపల్లి శివారు ప్రాంతంలో డీసీఎం ట్రాక్టర్‌ను బలంగా ఢీ కొట్టడంతో ట్రాక్టర్ ముందుభాగం బోర్లపడింది. ఈ ఘటనలో పులిమడుగుకు చెందిన ఆత్రం ఆనంద్ రావ్(45) అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడ్డ మరొకరిని వెంటనే ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు మహిళలకు ఏడాది జైలు

ఎదులాపురం, జూన్ 10 : గుడుంబా అమ్ముతూ పట్టుబడిన ఇద్దరి మహిళలకు ఏడాది పాటు జైలు శిక్షను విధించడం జరిగిందని ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ జుల్ఫేకర్ అహ్మద్ తెలిపారు. సోమవారం ఇచ్చోడ సీఐ తెలిపిన వివరాల ప్రకారం... గుడిహత్నూర్ మండలానికి చెందిన జాదవ్ విమల, భక్వాడ్ లక్ష్మిలు గుడుంబా అమ్ముతూ పలుమార్లు పట్టుబడ్డారు. వారిని తహసీల్దార్ ఎదుట ప్రవేశపెట్టగా బైండోవర్ విధించారు. అయినప్పటికీ మళ్ళీ గుడుంబా అమ్ముతూ పట్టుకోగా ఈ ఇద్దరికి ఒక సంవత్సరం జైలు శిక్షను తహసీల్దార్ కవితా రెడ్డి విధించారు. దీంతో ఇద్దరు మహిళలను ఎక్సైజ్ సిబ్బంది కార్తీక్, మహ్మద్, అరుణ, మంజుల, మయూరితో కలిసి జిల్లా జైలుకి తరలించడం జరిగిందని పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

మాల్వే చంద్రకళ

బోథ్, జూన్ 10 : బోథ్‌లోని న్యూ కాలనీకి చెందిన మాల్వే చంద్రకళ(42) ఆదివారం అదృశ్యమైంది. భర్త కూలీ పనికి వెళ్లగా ఆమె ఇంట్లోనే ఉంది. భర్త సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో కనిపించకపోవడంతో బంధువులను అడగగా సమాచారం తెలియలేదు. సోమవారం భర్త ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

ఉప తపాలా కార్యాలయంలో చోరీ

ఇచ్చోడ, జూన్ 10: మండల కేంద్రంలోని ఉప తపాలా కార్యాలయంలో ఆదివారం రాత్రి దొంగలు చొరబడ్డారు. రోజు లాగానే సిబ్బంది సోమవారం కార్యాలయానికి వచ్చి చూసేసరికి తపాలా కార్యాలయంలోని స్టాంపులు, డిజిటల్ లాకర్, రూ.6 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. దీంతో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో వచ్చి కార్యాలయంలో తనిఖీ చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నిర్మల్ అర్బన్, జూన్ 10 : నిర్మల్ బస్టాండ్ వద్ద గుర్తు తెలియని 60 నుంచి 65 సంవత్సరాల వ్యక్తి స్పృహ తప్పి పడిపోగా స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యక్తికి సంబంధించిన వివరాలు నిర్మల్ టౌన్ పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

కాన్సలేషన్ పాస్‌పోర్టు, డెత్ సర్టిఫికెట్ వెంటనే ఇప్పించాలి

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 10 : గత సంవత్సరం ఉపాధి నిమిత్తం మలేషియా దేశానికి వెళ్లిన లక్ష్మణచాంద గ్రామానికి చెందిన భీమేశ్వర్ అనారోగ్యంతో ఫిబ్రవరి 27న అక్కడే మృతి చెందగా అంత్యక్రియలు అక్కడే నిర్వహించారు. కుటుంబ సభ్యులు కాన్సలేషన్ పాస్‌పోర్ట్, డెత్ సర్టిఫికెట్ కొరకు సచివాలయంలోని సాధారణ పరిపాలన విభాగ అధికారులకు కలిశారు. ఫలితం లేకపోవడంతో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో పాటు ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్లకు బాధితులు వినతిపత్రం ఇచ్చారు.

అండర్-19 క్రికెట్ జట్టుకు ఎంపిక

ఎదులాపురం, జూన్ 10 : ఆదిలాబాద్‌కు చెందిన అబిద్ స్టార్ క్రికెట్ అకాడమీ నుంచి 10 మంది క్రీడాకారులు అండర్-19 క్రికెట్ సీనియర్ జట్టుకు ఎంపికయ్యారు. ఇటీవల మంచిర్యాలలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో వారు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఎంపికైన వారిలో షాదాబ్, కషిప్, అదిల్, కైఫ్, చందన్, నందన్, అవినాశ్, స్టాండ్ బై క్రీడాకారులుగా ఉన్నారు. వీరంతా హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో నిర్వహించే రెండు రోజుల మ్యాచ్‌లో ఆడనున్నారు. వీరిని సీనియర్ క్రీడాకారుడు అతవల్లా ఖాన్, అకాడమీ నిర్వాహకుడు అబ్దుల్ అబిద్, కోచ్ విజయకుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

భైంసాలో దొంగతనం

భైంసా, జూన్ 10 : భైంసాలోని ఎన్‌బీ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. ఎన్‌బీ కాలనీకి చెందిన వినయ్ కుమార్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో ఊరికి వెళ్లాడు. రాత్రి సమయంలో దొంగలు ఇంటి తాళం పగలగొట్టి రూ. 15 వేల నగదు, 3 తులాల బంగారం, 20 తులాల వెండి ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అంతేగాకుండా నేతాజీనగర్‌లో గల బాచోల్ల రమేశ్ ఇంట్లో దొంగతనం జరిగింది.

అక్రమంగా తరలిస్తున్న ఆవులు పట్టివేత

భైంసా, జూన్ 10 : భైంసాలోని బైపాస్ రోడ్డు వద్ద ఆదివారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఆవులను పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా పశువులను తరలిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజావాణిని వినియోగించుకోవాలి

దస్తురాబాద్, జూన్ 10 : ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకొని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, ఏడీఏ కెశెట్టి శ్రీనివాస్, డాక్టర్ నాగరాజు, ఏపీఎం గంగాధర్, వెటర్నరీ అసిస్టెంట్ దేవీదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కుంటాల, జూన్ 10 : ఎన్నికల కోడ్ ముగియడంతో సోమవారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని పునఃప్రారంభించారు. ఒక అర్జీదారు తన పట్టా పాస్‌బుక్‌లో భూవిస్తీర్ణ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఏ రహీం, ట్రాన్స్‌కో ఏఈ శివప్రసాద్, ఏవో సోమలింగా రెడ్డి, మెడికల్ ఆఫీసర్ శృతి రెడ్డి, ఏపీవో నవీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీ విశారద పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ముథోల్, జూన్ 10 :ప్రజా సమస్యల పరిష్కారానికై కృషి చేస్తామని తహసీల్దార్ విఠల్ అన్నారు. ముథోల్‌లోని తహసీల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సమస్యలున్నట్లయితే ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సాధ్యమైనవి ఇక్కడే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మైసాజీ, అధికారులు పాల్గొన్నారు.